సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఘనంగా భగీరథ జయంతి



జయంత్యుత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో భగీరథ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ వేడుకల్లో పాల్గొని, భగీరథుని విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీసీ సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్, మాజీ కౌన్సిలర్ ఈటి శ్యామలరావు, సంగర సంఘం ప్రతినిధులు సింహాచలం, తాతారావు, రాంబాబు, రామాలయం కమిటీ సభ్యులు శ్రీరామ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాసాలమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న దామా సుబ్బారావు దంపతులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌కాలనీలో రాసాలమ్మ వారి పండగ మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మెడికల్ బాబు, చేగొండి శ్రీనివాసరావు, పత్తిపాటి శ్రీను, శ్రీనివాస్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో దాతలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని సీతానగరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 66 మంది విద్యార్థులకు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. కణితి దుర్గాప్రసాద్ 6వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పాల్గొన్నారు. దుర్గాప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, కణితి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘం నాయకుడు కోయిలాడ ఆకస్మిక మృతి



కోయిలాడ రమణబాబు

ఉక్కునగరం: ఉక్కునగరం వర్తక సంఘం నాయకుడు కోయిలాడ రమణబాబు(53) గురువారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ వార్త తెలిసి ఉక్కు నగరానికి చెందిన వర్తకులు పలువురు ఆయన నివాసానికి చేరుకుని, వారి కుటుంబీకులను పరామర్శించారు. ఉక్కు కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, య.రామస్వామి, కోయిలాడ శ్రీనివాసరావు తదితరులు రమణబాబు నివాసానికి వెళ్లి కుటుంబీకులను ఓదార్చారు.

మినీ గోకులాల పనుల పూర్తికి చర్యలు

సింహాచలం: పెందుర్తి మండలంలో గతంలో మంజూరైన మినీ గోకులాల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటరావు సూచించారు. పశు సంవర్ధక శాఖ అధికారులతో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 58 మినీ గోకులాలు మంజూరు కాగా.. వాటిలో రెండు ప్రారంభం కాలేదని, మిగిలిన 56 మినీ గోకులాల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వాటి స్థితిగతులు పరిశీలించి మే నెలాఖారులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు నిధులు కూడా మంజూరవుతాయని వెంకటరావు అధికారులకు చెప్పారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606
సాక్షి

క్రీడా మైదానంపై క్రీనీడ

- విశాల ప్రాంగణం ఉన్నా సౌకర్యాల లేమి
- వాకింగ్ ట్రాక్ లేక వాకర్లకు అవస్థలు
- సదుపాయాల కోసం 14 గ్రామాల క్రీడాకారుల విన్నపం



చిన్నారుల రన్నింగ్ ప్రాక్టీస్



తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న బాక్సింగ్ రింక్



చదును చేసిన మైదానం

పెదగంట్యాడ: క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నా తగిన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. అందుబాటులో అరెకరాల స్థలం ఉన్నా, అక్కడ ఎటువంటి సదుపాయాలు లేకపోవడంతో మండలంలోని 14 గ్రామాల్లో క్రీడాకారులు నిరుత్సాహ పడుతున్నారు.

జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ వెనుక విశాల క్రీడా మైదానం ఉంది. గతంలో ఈ మైదానం పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండి ఉండేది. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ఆర్థిక సాయంతో పిచ్చిమొక్కలు తొలగించి, చెత్తను తరలించారు. కొంతమంది క్రీడాకారులు, కోచ్‌లు వారికున్న అవకాశం మేరకు సొంత నిధులతో మైదానాన్ని చదును చేయించారు. మట్టి తీసుకువచ్చి గోతులను పూడ్పించి, క్రీడాకారులకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు అక్కడ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడాకారుల సందడి కనిపిస్తోంది. పిల్లల నుంచి పెద్దల వరకు అక్కడే ఆటలాడుతూ, వాక్ చేస్తూ కనిపిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు పెద్ద సంఖ్యలో స్థానికులు వస్తున్నారు. కానీ అక్కడ వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కోచ్‌ల సహకారంతో బాక్సింగ్, కరాటే నేర్చుకుంటున్నారు. అయితే బాక్సింగ్ రింక్ లేక చిన్నారులు బాక్సింగ్ ప్రాక్టీస్‌కు తంటాలు పడుతున్నారు.

వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్, బాక్సింగ్ ప్రాక్టీస్ కోసం బాక్సింగ్ రింక్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, ఫుట్‌బాల్ తదితర క్రీడల కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, క్రీడా సామగ్రి అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా చిల్డ్రన్స్ పార్కు, యోగా స్టేజ్, అథ్లెటిక్స్ క్రీడాకారుల కోసం అవసరమైన సదుపాయాలు కల్పిస్తే ఇక్కడి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు.

ఆర్మీ, పోలీస్ ఉద్యోగాలకు ఇక్కడే ప్రాక్టీస్

ఆర్మీ, పోలీస్ ఉద్యోగాల కోసం ప్రతి రోజూ ఇక్కడ యువత ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే వారికి అవసరమైన సదుపాయాలు లేవు. దూర ప్రాంతాలకు వెళ్లలేక, డబ్బులు చెల్లించి శిక్షణ తీసుకోలేక అవస్థలు పడుతున్నారు. వీరి ఆసక్తిని గుర్తించి, ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలంటున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



ఇక్కడ చిన్నారులకు రోజూ బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తున్నా.. కానీ సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారుల్లో ఆసక్తి తగ్గిపోతోంది. చుట్టు పక్కల గ్రామాలకు ఇదొక్కటే మైదానం. సౌకర్యాలు కల్పించాలి.

– జి.వి.రెడ్డి, బాక్సింగ్ కోచ్, ఎక్స్ ఆర్మీ,పాత అయ్యన్నపాలెం

మహిళలకు మోటారు కుట్టుమిషన్ల పంపిణీ

- రోటరీ ఫౌండేషన్ వితరణ



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు అందించిన రోటరీ ఫౌండేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: రోటరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు గురువారం కుట్టుమిషన్లు అందజేశారు. వృత్తి విద్యా శిక్షణలో భాగంగా రోటరీ ఫౌండేషన్ గ్లోబల్ గ్రాంట్స్ ద్వారా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో మహిళలకు 3 నెలల పాటు కుట్టుపనిలో శిక్షణ నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 22 మంది మహిళలకు గురువారం పంచవటి కమ్యూనిటీ హాల్లో రోటరీ ఫౌండేషన్ పూర్వ గవర్నర్, ప్రాజెక్ట్ చైర్మన్ ఎం.జగదీశ్వరరావు సర్టిఫికెట్లతో పాటు మోటారు కుట్టు మిషన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని 6 సెంటర్లలో 12 షిఫ్టుల్లో 261 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చిన, మిషన్లు అందించామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారికి బ్యాంక్ రుణాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వారికి అవుట్ సోర్సింగ్ ద్వారా వ్యాపార అవకాశాలను కల్పించి ఉపాధి కల్పించేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సీహెచ్.రామలింగరాజు మాట్లాడుతూ గత బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో కొందరికి అడ్వాన్స్‌డ్ శిక్షణను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్లు అప్పలనాయుడు, ఏపీవో మనోహర్, ట్రైనర్ జగదీశ్వరి, పోవా కార్యదర్శి రామ్మోహనరావు, సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

అమృతరావు స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యమ నేత అమృతరావు స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 805వ రోజు గురువారం ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ముందుగా ఉక్కు పోరాట యోధుడు దివంగత తమనంపల్లి అమృతరావు వర్ధంతిని పురస్కరించుకుని దీక్షా శిబిరం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని, లేకపోతే పోరాటాల ద్వారానే ప్రైవేటీకరణ అంశానికి తెరపడేలా చేసి కేంద్రానికి తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు కార్మికులు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

త్యాగధనుడు అమృతరావు

- వర్ధంతి సందర్భంగా నేతల ఘన నివాళులు



ఉక్కు హిల్‌టాప్ కూడలిలోని అమృతరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావం కోసం తన జీవితాన్ని పణంగా పెట్టిన మహోన్నత వ్యక్తి తమనంపల్లి అమృతరావు అని గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, లీడర్ సంపాదకులు వి.వి. రమణమూర్తి అన్నారు. ఉక్కు ఉద్యమనేత అమృతరావు 34వ వర్ధంతి సందర్భంగా గాంధీ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న అమృతరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ రోజు ప్లాంట్‌పై ఆధారపడి లక్షలాది మంది జీవిస్తున్నారంటే అమృతరావు వంటి వారి త్యాగాలే కారణమన్నారు. కార్యక్రమంలో అమృతరావు మునిమనుమడు టి. మోహన్‌గాంధీ, నిర్వాహకులు ఎ.వి.రమణారావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్, కోరాడ వెంకటరావు, నీరుకొండ రామచంద్రరావు, బి. ఎల్లాజీ రాజు, రామ్మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ నివాళులు

ఉక్కు ఉద్యమ నేత అమృతరావుకు స్టీల్ వైఎస్సార్ టీయూసీ నాయకులు నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ అమృతరావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వై.మస్తానప్ప, కె. శ్రీనివాస కుమార్, నమ్మి ప్రసాద్, కె.మహేష్, పి. మూలయ్య, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఏసీ లాంజ్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఏసీ ప్రీపెయిడ్ వెయింటింగ్ లాంజ్ అందుబాటులోకి వచ్చింది. గతంలో ఉన్న ఉన్నత తరగతి ప్రయాణికులు వేచియుండే వసతినే ప్రస్తుతం ఏసీ లాంజ్‌గా రూపొందించి, అందుబాటులోకి తీసుకువచ్చారు. విజయవాడ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లు ఆలస్యమైన వేళల్లో ప్రయాణికులు ప్లాట్‌ఫాంపై వేచి ఉండాల్సి వస్తోంది. ప్రయాణికుల ఇబ్బందులను దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ డీఆర్‌ఎం దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి, ఏసీ ప్రీపెయిడ్ లాంజ్‌ను ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: 11కేవీ పెదగంట్యాడ ఫీడర్ పరిధిలో శుక్రవారం చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టనున్న నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని పరిధిలోని గొడ్డువానిపాలెం, దుర్గవానిపాలెం, నెల్లిముక్కు, సీతానగరం, పెదగంట్యాడ మెయిన్‌రోడ్డు, బర్మా కాలనీ, బాబూ జగ్జీవన్‌రామ్ నగర్, రైతుబజార్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

'నేను ఆ అమ్మాయిని ప్రేమించాను.. కానీ'

దువ్వాడలో కొత్త సినిమా చిత్రీకరణ ప్రారంభం



క్లాప్ కొడుతున్న మాజీ డిప్యూటీ మేయర్ సత్యనారాయణ, దేవన్‌రెడ్డి

అగనంపూడి: వరలక్ష్మి క్రియేషన్స్ బ్యానర్‌పై బొత్స రామ్, సుమల, మౌర్య కర్ణిక హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న నేను ఆ అమ్మాయిని ప్రేమించాను కానీ.. సినిమా ముహూర్తం షాట్‌ను దువ్వాడ సెక్టార్-1 రామాలయంలో చిత్రీకరించారు. విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి క్లాప్ కొట్టి, ముహర్తపు షాట్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకాదరణ పొంది, మంచి చిత్రంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహాయ నిర్మాతలు గుడివాడ శ్రీనివాసరావు, ఎస్.ఎస్.ఎన్.ప్రసాదరావు, రాజు, నారాయణరావు, పైడిరాజు, విజయ్‌కుమార్, చలపతిరావు, వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, దువ్వాడ సీఐ బి.శ్రీనివాసరావు, మా అసోసియేషన్ కార్యదర్శి వై.అప్పారావు పాల్గొన్నారు.

షిర్డీ సాయి శాంతి ధామం నూతన కార్యవర్గం



ఆలయంలో కొత్త కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిధామం ఆలయ కమిటీ చైర్మన్‌గా నక్కా లక్ష్మణరావు ఎన్నికయ్యారు. ఆలయ ప్రాంగణంలో నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా కొండ శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా పల్లి సత్యనారాయణ, జాయింట్ ట్రెజరర్‌గా బుగిడి రామకృష్ణ, ముఖ్య సలహాదారుగా వైవీ రమణ, సలహాదారుగా సత్యంబాబు ఎన్నికయ్యారు.

సమతానగర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం

సమతానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా బెవర సత్యనారాయణ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బుద్ధపు ధర్మారెడ్డి, కోశాధికారిగా చింతల కిశోర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొర్రా హిమంతరావు, గౌరవాధ్యక్షునిగా వై.మన్మథరావు, జాయింట్ సెక్రటరీగా డొప్ప అప్పలనాయుడు, జాయింట్ ట్రెజరర్‌గా ఎండీ ఖాజా ఎన్నికయ్యారు.

'జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి'



డొంకాడలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న రామచంద్రరాజు

అగనంపూడి: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, గాజువాక జేసీఎస్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ వాడపల్లి రామచంద్రరాజు అన్నారు. 85వ వార్డు డొంకాడ నిర్వాసిత కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, ప్రజలను కలిశారు. సీఎం జగన్ అందిస్తున్న పథకాల గురించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పార్వతి, గోవింద్, దాసరి నూకరాజు, సాలాపు అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

– 88వ వార్డు కాపుజగ్గరాజుపేట సచివాలయ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్సీపీ వార్డు ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, రామచంద్రరాజు ప్రజల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. నత్తల భాగ్యలక్ష్మి, నమ్మి శ్రీనివాస్ ప్రసాద్, మాడిశ అప్పలరాజు, గుంట్ల లక్ష్మి, మచ్చ రామకృష్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా..

- కళాశాలల్లో పోస్టర్ల ఏర్పాటు



గాజువాకలోని ఓ కళాశాల వద్ద పోస్టర్ అతికిస్తున్న సీఐ భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కృషి చేయాలని గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు కోరారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు గాజువాకలోని పలు విద్యా సంస్థల వద్ద డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ పోస్టర్లను గురువారం అతికించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కొల్లి సతీష్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బంగారు భవిష్యత్తు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు సాధ్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు కాపుతుంగ్లాంలో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు జగన్ మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వారికి పథకాల బ్రోచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా చంద్రబాబును నమ్మం అంటూ ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. ఖర్మ కాలి చంద్రబాబుకు అధికారం కట్టబెడితే రాష్ట్రం రావణకాష్టంలా మారుతుందన్నారు. నిద్ర లేచింది మొదలు జగన్‌మోహన్ రెడ్డిపై విషం చిమ్మడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రవర్తిస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదప్రజల సంక్షేమానికి, రాష్ట్రం అభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతుంటే.. చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ, రాష్ట్రం నాశనాన్ని కోరుకుంటున్నారన్నారు. ప్రజలు ఆయనకు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. గాజువాకను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చెప్పారు. గాజువాకలో రోడ్లు, కాలువలు, తాగునీటి సమస్యలను 80 శాతం తీర్చానని అన్నారు. వార్డు అధ్యక్షుడు, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, విరోతి రాము, సాలాపు వెంకటరావు, దుబాయి శ్రీను, రాంబాబు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



రోహిత్ ప్రసాద్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: చేసిన అప్పులు తీర్చలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గాజువాక సింహగిరికాలనీలో గురువారం చోటు చేసుకుంది. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సింహగిరి కాలనీకి చెందిన రోహిత్ ప్రసాద్ (22) జులాయిగా తిరుగుతూ, బాధ్యత లేకుండా ఉండేవాడన్నారు. ఇతనిపై గాజువాక, స్టీల్‌ప్లాంట్, న్యూపోర్టు పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులున్నాయని చెప్పారు. ప్రసాద్ అందిన ప్రతి చోటా అప్పులు చేసి, కొద్ది రోజులుగా ఇంటికి కూడా వెళ్లలేదని తెలిపారు. ఈ క్రమంలో సింహగిరికాలనీ కొండపై, అతని నివాసం పక్కనే నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో తాడుతో శ్లాబ్‌కు ఉరివేసుకున్నట్లు తెలియజేశారు. మృతుని తండ్రి మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నారు. మృతునికి భార్య, ఒక బాబు ఉన్నారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ఉప ప్రధానార్చకుడు, ఉద్యోగులు, భక్తులు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ సేవ నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయంగా నిత్య కల్యాణం

అప్పన్నస్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేయింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

సబ్బవరం: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంచుకుని అందులోని నైతిక విలువలను అలవరుచుకోవాలని ఏయూ తెలుగు విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకటస్వామి సూచించారు. సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం జూనియర్ అధ్యాపకుడు బద్రి కూర్మారావు రచించిన 'పిల్లలు రాసిన కళింగ జానపద కథలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. గురుకులం ప్రిన్సిపాల్ విజయకుమార్ ఆధ్వర్యంలో గురుకులం పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి ఎస్.రూపావతితో కలిసి బూసి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతికత బాగా విస్తరిస్తున్న ఈ ఆధునిక కాలంలో అమ్మమ్మ, తాతయ్యలు చెప్పిన కథలు విని తమ బాల్యాన్ని మలచుకునే సంస్కృతి నానాటికీ కనుమరుగవుతుందన్నారు. బద్రి కూర్మారావు మరుగునపడిన కథలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేసి సఫలం కావడంపై బూసి ప్రశంసించారు. సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్న పసితనం ఈ కథలు చదివి వారిలోని ఆలోచన దృక్పథాన్ని పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు.

మరో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు



ఆచార్య వి.ఎస్‌రాజును సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి, ఐఐటీ ఢిల్లీ పూర్వ సంచాలకుడు వి.ఎస్.రాజు గురువారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా కార్యాలయంలో భేటీ అయ్యారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాలను రెండు వారాల పాటు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. తాను చదువుకున్న సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో మూడు సంవత్సరాల కాలానికి ఒక చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయాలని వీసీని రాజు కోరారు. విభాగంలో మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలల ఆధునికీకరణకు సహకారం అందిస్తానన్నారు. అనంతరం సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సత్యనారాయణరెడ్డి, డీఎస్‌టీ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆర్.ప్రసాదరాజు, ఆచార్య కె.రాజగోపాల్, వై.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com